కథ

# సదా శోభాగా హిందూస్తాన్

వి.ఎల్. పద్మసుందరి

''ఏం నాన్నా? 'రాను' అన్నదే మీ సమాధానమా?'' అడిగాడు ఫణి.

శ్రద్ధగా కంపోజ్ చెయ్యాల్సిన అక్షరాలను బ్లాకులో పేరుస్తున్న మాధవశర్మ తల ఎత్తకుండానే ''ఫణీ! నీకు తెలుసు ఏభై ఏళ్ళుగా నా జీవితంలో ఓ భాగమైపోయిన ఈ ప్రెస్‌ని, అమ్మ జ్ఞాపకాలు నిండిన ఇంటిని వదిలి నేనెక్కడికీ రాలేనని'' నిర్లిప్తంగా అన్నాడు.


''కానీ మీ వయసు అరవై దాటింది. నేనా ఎక్కడో బోర్డర్‌లో జవానుగా చేస్తున్నాను. ఒంటరిగా ఉంటే ఇక్కడ మీకేదైనా అయితే నాకెంత బాధో ఆలోచించారా?'' దగ్గరకి వచ్చి అన్నాడు.

''ఒంటరిగా ఎక్కడున్నాను? నా దగ్గర పనిచేసే రంగా, శారద, అబ్దుల్లా, ఏసుదాసు అంతా ఉన్నారుగా. నీ దగ్గరకి వస్తే నాకేమాత్రం పరిచయం లేని అక్కడి వాతావరణమే నన్ను ఒంటరిని చేస్తుంది. అర్థం చేసుకో'' మృదువుగా చెప్పారు.

తెలియని ఉక్రోషం రేగింది ఫణిలో ''మీ ఇష్టం. ఏనాడు కొడుకుని నా మాట విన్నారు కనుక'' విసురుగా లోనికి వెళ్ళిపోయాడు.

గాఢంగా నిట్టూర్చాడు శర్మ. ఒకసారి జీవనాధారమైన ప్రాణంలాంటి తన ప్రెస్‌ని కలయచూసుకున్నాడు. ఓ మాదిరి టౌనులాంటి ఆ ఊరిలో శర్మ తండ్రి స్థాపించిన 'జైహింద్ ప్రింటింగ్ ప్రెస్' మొదటి అచ్చుయంత్రం. శర్మ గారి తండ్రి ఆ ప్రెస్ ద్వారానే స్వాతంత్రోద్యమ సమయంలో దేశభక్తి పూరిత కరపత్రాలను, పత్రికలను ముద్రించేవాడు. తన పదేళ్ళ వయసు నుండే తండ్రి వెనక ఉంటూ అచ్చు వేసే పనిని నేర్చుకున్న శర్మ క్రమంగా దానినే జీవనాధారం చేసుకున్నాడు.

ఒకప్పుడు పాతికమంది వర్కర్లతో అరడజను మిషన్లతో సందడిగా ఉండే ఆ ప్రెస్ కాలానుగుణంగా వచ్చిన స్క్రీన్‌ప్రింటింగ్, కలర్ ప్రాసెసింగ్, డి.టి.పి. లాంటి ఆధునిక యంత్రాల పోటీకి నిలవలేక మెల్లగా తన ప్రాభవాన్ని కోల్పోయింది. కేవలం 'జైహింద్ ప్రెస్' గుడ్‌విల్‌తో వచ్చే కొద్దిపాటి ఆర్డర్లను అబ్దుల్లా, శారదా కంపోజర్లుగా, రంగా మిషను ఆపరేటరుగా, ఏసుదాసు ప్రింటింగ్ మెటీరియల్స్, ఆర్డర్స్ డెలివరీ చేసే ఆటోవాలాగా పెట్టుకొని నెట్టుకొస్తున్నాడు. నలుగురూ ఇరవై ఏళ్ళు నిండకుండానే బాధ్యతలు భారాన్ని మోస్తూ శర్మకి ఆసరాగా ఉంటున్నారు. అంతా శర్మ గారిని 'బాబా' అని పిలుస్తూ కలివిడిగా ఉంటారు.



ఆలోచనలలో మునిగి ఉన్న శర్మ 'బాబా, బాబా' అని అరుస్తూ వచ్చిన అబ్దుల్లా పిలుపునకు తేరుకొని సగంలో ఆపేసిన బ్లాకును చేతిలోకి తీసుకున్నాడు.

''బాబా, నీకో గుడ్ న్యూస్, ఓ బేడ్ న్యూస్. ఏది ముందు చెప్పను?'' అడిగాడు.

పసితనం వీడని అబ్దుల్లా తత్వానికి నవ్వుకుంటూ ''చేదు తర్వాత తీపి, చేదువల్ల కలిగే వెగటుని తగ్గిస్తుందిట. ముందు చెడు వార్తే చెప్పు'' పర్మిషను ఇచ్చాడు.

''అయితే విను, సోమవారం నుండి నేను ఉదయం తొమ్మిది దాటితే కానీ రాలేను. ఇదివరకులా పని ఎక్కువ ఉంది. ఆరుకే రా, ఏడుకే రావాలి అంటే కుదరదు'' చెప్పాడు.

ఆ ప్రెస్‌కి తానే మూలాధారం అన్నట్లు అన్న అబ్దుల్లాని చూస్తూ ''పెద్దచిక్కే బాబా! పాపం ఈయనగారు లేకపోతే మన ప్రెస్ ఉదయాన్నే తలుపులు కూడా తెరుచుకోలేవు కదా'' వెక్కిరించింది బైండింగ్ పేపర్లు కత్తిరిస్తున్న శారద.

ఉడుక్కున్నట్లు బదులివ్వబోయిన అబ్దుల్లాని ''ఇంతకీ విషయం ఏమిటో చెప్పలేదు'' శర్మ దృష్టి మరలించాడు.

శారదకి చెప్పే ఘాటు సమాధానాన్ని పక్కన పెట్టి ''ఏముంది బాబా, మా ముస్లిం పిల్లలమంతా మాత్ర

భాష ఉర్దూని నిర్లక్ష్యం చేస్తున్నామట. మాలో కొంత మందికి ఉర్దూ అక్షరాలు చదవడమే రాదు. అందుకే పెద్ద మసీదులోని మౌల్వీలంతా కలిసి రేపు సోమవారం నుండి రోజూ ఉదయం ఐదుగంటలకి నమాజు నియమాలు, ఖురాను పఠనం, ఉర్దూ పాఠాలు వంటి క్లాసులు చెబుతారుట. ప్రతీ ముస్లిం కుటుంబం తమ పిల్లలను తప్పనిసరిగా పంపాలని ఫత్వా జారీ చేశారు. అమ్మీ జాన్ వెళ్ళమని పోరుతోంది. అక్కడికి వెళ్ళి వచ్చి అమ్మకి అంగడిలోకి సరుకులు తెచ్చి ఇచ్చి రావాలంటే తొమ్మిది దాటుతుంది కదా?'' చెప్పాడు.

అబ్దుల్లా తండ్రి కరీం నలుగురు ఆడపిల్లల తర్వాత ఒక్క మగబిడ్డగా అబ్దుల్లానిచ్చి అర్ధాంతరంగా మరణిస్తే చక్కగా చదువుకునే కొడుకును శర్మ దగ్గర పదేళ్ళకే పనిలో పెట్టి కూతుళ్ళ సాయంతో ఇంటి దగ్గర చిన్న చిల్లరి అంగడి నడుపుకుంటున్న ఫాతీమా పరిస్థితి తెలిసిన శర్మ అంగీకారంగా తల ఊపుతూ ''నిజమేరా! తెలుగు, ఉర్దూ కలగలిపి మాట్లాడే సంకర భాష తప్ప నాకున్నపాటి అక్షర పరిజ్ఞానమైన నీకు లేదు. ప్రతి వ్యక్తి కన్నతల్లితో సమానంగా మాతృభాషని గౌరవించాలని ఠాగూర్ చెప్పేవారు. తప్పకుండా వెళ్ళు'' ప్రోత్సహించారు.

లోపలి గదిలో టి.వి.ముందు కూర్చుని కాశ్మీరులో మిలట్రీ హెడ్‌క్వార్టర్స్ మీద జరిగిన మానవదాడి వార్తను శ్రద్ధగా వింటున్న ఫణి కాస్త అసహనంగా కదిలాడు.

''ఇంతకీ గుడ్ న్యూస్ ఏంటీ?'' రంగా అడిగాడు.

జేబులోంచి మడత పెట్టిన కాగితాలు తీసి శర్మకి అందిస్తూ ''గుడ్‌న్యూస్ కూడా ఇందులోనే ఉంది. మా మౌల్వీలు జారీ చేసిన ఫత్వాను తెలుగు, ఉర్దూలలో పోస్టర్ల రూపంలోనూ, కరపత్రాల రూపంలోనూ అచ్చువేసి ఇవ్వాలి. అంతే కాదు వచ్చేది రంజాన్ మాసం కదా ప్రార్థనా సమయాలు, నియమాలు అన్నీ ఉన్న కేలండర్స్ వెయ్యాలి. ఈ చుట్టుపక్కల ఉర్దూ అక్షరాల డైసు ఉన్నది మన ప్రెస్‌లోనే. పైగా బాబాకి ఉర్దూ బాగా వచ్చుకదా. అదే చెప్పి మొత్తం ఆర్డర్లన్నీ తీసుకొచ్చేశాను. ఇంకో పదిరోజులు చేతినిండా పని, జేబునిండా డబ్బు'' సంతోషంగా చెప్పాడు.

ఆర్డర్లు తగ్గి ఉన్న నలుగురికే జీతాలు ఇవ్వడానికి ఇబ్బందిపడే సమయంలో అబ్దుల్లా తెచ్చిన ఆర్డర్ సంతోషాన్ని కలిగిస్తుంటే మెల్లగా వెళ్ళి తన టేబుల్ దగ్గర కూర్చుని కాగితాలు పరిశీలించసాగాడు. శారదా, రంగా దగ్గరకి వచ్చి అబ్దుల్లాని అభినందిస్తుంటే వచ్చాడు ఏసుదాసు.

ఒక చేత్తో ఇంకు డబ్బా, మరో చేత్తో భుజం మీద కాగితాల రీము మోసుకొచ్చి ఖాళీ బల్లమీద పెట్టి ''ఏంటి సంగతి? అబ్దుల్లాని మోసేస్తున్నారు'' అడిగాడు. వంతులేసుకొని ముగ్గురూ అబ్దుల్లా తెచ్చిన ఆర్డర్ గురించి చెప్పారు. శర్మ టేబుల్ ముందు ఉన్న కుర్చీ లాక్కొని కూర్చుని ''బాబా, నేనూ ఇలాంటి ఆర్డర్‌నే తెచ్చాను'' అన్నాడు. రంగా, శారదా కూడా అక్కడికి చేరిపోయారు. ''నిజంగా?'' వాళ్ళ గొంతులో సంతోషం.

''మన పెద్ద బజారులోని సెయింట్ పాల్ చర్చి పాస్టరుగారు ఇందాకా పిలిచి చెప్పారు. రెవరెండ్ శామ్యూల్‌గారనే ఓ పెద్ద ప్రచారకులు వచ్చేనెల ఐదవ తేదీన రాజమండ్రిలో పెద్ద బహిరంగ సభలో ప్రసంగించడానికి వస్తున్నారుట. దానికోసం క్రీస్తు భక్తులను ఆహ్వానిస్తూ పోస్టర్లు, పాంప్లెట్స్ మీరు వేస్తారేమో కనుక్కోమన్నారు. నేనే..మీరు మతపరమైనవి వేస్తారో లేదోనని ఏ విషయం రేపు చెబుతానన్నాను'' నసుగుతున్నట్లు చెప్పాడు.

''ఎందుకు వెయ్యం? మొన్ననేగా 'గీతా జ్ఞాన యజ్ఞం' గురించి వేశాం'' శారద ఆశ్చర్యంగా అడిగింది.

''అవును..క్రిందటి నెల కాకినాడలో చినజీయరు ప్రసంగాలు గురించి కూడా వేశాం'' అబ్దుల్లా శారదని సమర్థించాడు.

''ప్చ్! అవి వేరు. అవన్నీ హిందూ మతానికి చెందినవి. బాబా బ్రాహ్మలయ్యుండి ఇవి వేస్తారో లేదోనని చెప్పలేదు'' కసిరినట్లు అన్నాడు ఏసుదాసు.

అసలు సమస్య అర్థమయినట్లు అంతా శర్మకేసి ఊపిరి బిగించి చూశారు. ఒక్క క్షణం వాళ్ళని కలయచూసి ''దాసూ! ఇంకో గంటలో పన్నెండవుతుంది. నీకూ నాకూ అబ్దుల్లాకీ ఆకలవుతుంది. రాత్రయితే నిద్ర వస్తుంది. అవునా?'' అడిగి, ''దేవుడు మనిషిని మాత్రమే సృష్టించాడు. అందుకే ప్రకృతి సిద్ధమైన లక్షణాలు అందరికీ ఒకటే వచ్చాయి. మనిషి సాంఘిక, ఆర్థిక భద్రత కోసం ఏర్పరచుకున్న వ్యక్తిగత భావన మతం. కనుక మన మతాన్ని గౌరవిద్దాం. పరమతాన్ని ప్రేమిద్దాం..ఏమంటారు?'' అందర్నీ ఉద్దేశించి ప్రశ్నించాడు.

పిల్లల అంగీకారం చప్పట్ల రూపంలో వ్యక్తమయ్యింది. వ్యతిరేకత మాత్రం గదిలో నుండి విసురుగా వచ్చిన ఫణి నోటి నుండి పలికింది.

''హిందువులంతా మీలా ఆలోచించబట్టే ఒకప్పుడు నామ మాత్రంగా ఉన్న ఇతర మతాల వారి సంఖ్య ఇప్పుడు దాదాపు ముప్పై శాతానికి పెరిగింది. సాంఘికంగా, ఆర్థికంగా దిగువ స్థాయినున్న హిందువులకి డబ్బు, ఉద్యోగాలు, బట్టలు వంటివి ఎర చూపి విచ్చలవిడిగా మత మార్పిడికి ప్రోత్సహిస్తున్నారు. ఫలితం చూడండి. మత ద్వేషాలు పెరిగి తీవ్రవాదులు వేర్పాటువాదులు పెరుగుతున్నారు. సొంత దేశం కావాలంటూ కన్నవాళ్ళని, కట్టుకున్న

## గ్లామర్‌తార

నవ్వులు పూయిస్తున్న ఈతరం వినోదాల తో'రణం'లో నటించిన అందాలభామ కామ్న జెఠ్మలానీ ఇప్పుడు గ్లామర్ పాత్రల్ని పోషించేందుకు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నట్టు కన్పిస్తోంది. 'రణంలో నా నటనకు మంచి స్పందన లభించింది. ఇకనుంచి ఇలాంటి గ్లామరస్ పాత్రలకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలనుకుంటున్నా' అంటోంది కామ్న. ఇలాంటి గ్లామర్ పాత్రలకి ఆమె ఇమేజ్‌ని పెంచుతాయేమో గానీ ప్రేక్షకులు ఎక్కువకాలం గుర్తుంచుకునే అవకాశం ఇవ్వవంటున్నారు ఇండస్ట్రీ జనం.



వాళ్ళని వదిలి దేశం కోసం పోరాడే మాలాంటి జవాన్లనే కాదు..ఏ పాపం ఎరుగని సామాన్యులను కూడా పొట్టన పెట్టుకుంటున్నారు'' మండిపడుతూ అన్నాడు. కొద్దిక్షణాల ముందు కాశ్మీరు మిలిటెంట్ దాడిలో మరణించిన తన తోటి సైనికుల మరణవార్తలు టీవీలో వినడంతో కలిగిన ఆవేదన అతని స్వరంలో తొంగి చూస్తోంది. అబ్దుల్లా, ఏసుదాసు చెయ్యని తప్పునకు దోషుల్లా తలవంచుకున్నారు.

''ఫణీ...ఏమిటీ ఆవేశం? ఏమయ్యిందని ఇప్పుడు?'' వారించబోయాడు శర్మ.

''ఏమయ్యిందా? వయసు, అనుభవం ఉన్న మీలాంటి పెద్దలే ఇలాంటి మతపరచర్యలను ఖండించవలసింది పోయి అచ్చేసి మరీ జనం మీదకి వదులుతుంటే మతోన్మాదం పెరిగి అన్ని మతాలవాళ్ళు వేర్పాటువాదంతో దేశాన్ని ముక్కలు చేసే దుస్థితి దాపురించింది'' కోపంగా అన్నాడు.

మాధవరావు నిట్టూర్చాడు ''ఫణీ..మన దేశ విధానం లౌకిక రాజ్యం. పరమత సహనం హిందూ జాతి రక్తంలోనే ఉంది. రాజ్యాంగం దానిని సమర్థిస్తోంది''

''రాజకీయ నాయకులు ఓట్లు దండుకోడానికి, పదవులకోసం లౌకికరాజ్య పదాన్ని వాళ్ళ లౌక్యానికి బాగా వాడుకుంటున్నారు. కనీసం ప్రతి హిందువూ నా మతాన్ని, సంస్కృతిని నేను కాపాడుకుంటాను. నేను మరో మతాన్ని ఆశ్రయించను, ప్రోత్సహించనని ఒట్టు పెట్టుకుని కృషి చేస్తే 'హిందూస్తాన్' అనే ఈ దేశపు పేరు సార్థకమవుతుంది. లేదంటే మరో పాతికేళ్ళు గడిచేసరికి హిందువులే తమ హక్కుల కోసం పరాయి మతస్థుల ముందు పాకులాడవలసిన దుస్థితి దాపురిస్తుంది. సనాతన హైందవ సంస్కృతికి ప్రతీకలైన మాధవశర్మగా మీరు ఆ పరిస్థితికి కారకులు కావడం మీ కొడుకుగానే కాదు ఒక హిందూ పౌరుడిగా నాకు ఇష్టం లేదు'' చెప్పి బయటికి వెళ్ళిపోయాడు.

ఫణి మాటల్లోని చేదు నిజాలు మనసును తాకినట్లు నిశ్చేష్టులుగా నిలబడిపోయిన అందరూ మెల్లగా ఒక్కొక్కరుగా తమ పనుల వైపు వెళ్ళిపోయారు.

శర్మ మనసు మాత్రం ఇదీ అని చెప్పలేని వేదనకి, వత్తిడికి గురి కాసాగింది. ఫణి మాటలు నిలదీసి ప్రశ్నిస్తున్నట్లు భావన కలుగుతుంటే..తెలియని భారం గుండెలను బరువెక్కించి భరించలేనిదిగా అనిపిస్తుంటే..నిలువెల్లా చమటలతో ముద్దవుతూ గుండెను కుడిచేత్తో నొక్కుకుంటూ ముందుకు బల్లపైకి వాలిపోయాడు. యధాలాపంగా గమనించిన అబ్దుల్లా ''బాబా పడిపోతున్నారు'' అరచి చెప్పడంతో రంగా గభాలున వచ్చి పొదివి పట్టుకున్నాడు.

★ ★ ★

రెండు రోజుల అనంతరం.

ఫణి బలవంతం వల్ల మంచం దిగకుండా విశ్రాంతి తీసుకుంటున్న తండ్రి దగ్గరకి వచ్చి ''నాన్నా, అబ్దుల్లా తెచ్చిన ఫత్వా డమ్మీ ప్రూఫ్ రడీ అయ్యింది. మీరో సారి చూసి ఓ.కే. చేస్తే ప్రింట్లు వేసేస్తానంటున్నాడు రంగా'' కాగితాలతో వచ్చి అన్నాడు ఫణి. దిండుకు ఆనుకొని కూర్చుని కళ్ళజోడు పెట్టుకొని వాటిని పరిశీలించి అక్షరం తప్పుల్ని దిద్ది..చెయ్యాల్సిన మార్పులు చెబుతుంటే..దాసు వచ్చి పలకరించి వెళుతూ జేబులోంచి రిజర్వేషన్ టిక్కెట్లు తీసి ఇచ్చి ''ఎల్లుండి సాయంత్రానికి దొరికాయి'' చెప్పాడు. అతను వెళ్ళే దాకా ఆగి తన చేతిలోని కాగితాలు తిరిగి ఇస్తూ..

''నన్ను కూడా తీసుకెళ్ళాలని రిజర్వేషన్ ఇద్దరికీ చేయించావా?'' అడిగాడు శర్మ.

''లేదు, నా ఫ్రెండ్ ఇస్మాయిల్ బి.ఎస్.ఎఫ్‌కి సెలక్టు అయ్యాడు. నేనుండేది పూనాలోనే కనుక అతన్ని పూనా ట్రయినింగ్ బేస్‌మెంట్‌లో అప్పగిద్దామని నాతో తీసుకెళ్తున్నాను'' చెప్పాడు.

శర్మ కళ్ళు ఆశ్చర్యంగా విచ్చుకున్నాయి ''మొన్ననేగా హిందువులెవరూ ఇతర మతస్థులను ఏ రకంగానూ ప్రోత్సహించకూడదన్నావు. మరి ఇప్పుడేంటి నువ్వే దగ్గరుండి ఫత్వాను అచ్చు వేయించడంతోపాటు నీ స్నేహితుడు ముస్లిమైనా వెంటపెట్టుకొని మరీ తీసుకువెళ్తున్నావు? హఠాత్తుగా ఏమిటీ మార్పు?''


''మీకు గుండెనొప్పి వస్తే కన్నకొడుకైన నాకన్నా మీ క్షేమం కోసం తల్లడిల్లిన అబ్దుల్లా, దాసులకు మీపై ఉన్న అభిమానాన్ని కళ్ళారా చూశాను. మీరు కోలుకోవాలని ప్రార్థనలు జరిపే ఫాతిమా దీదీ అమ్మ మనసు తెలుసుకున్నాను. మతానికి మానవత్వానికి సంబంధం లేదని గ్రహించాను. ఇది నాకు మొదటి పాఠమైతే ఇస్మాయిల్ దేశభక్తి రెండో గుణపాఠం. ఇస్మాయిల్ నాతోనే డిగ్రీ పూర్తిచేసి నాతో సమంగా సైనిక్ సెలక్షన్స్‌కి పరీక్షలు రాస్తూ వచ్చాడు. నాకు మొదటి ఛాన్స్‌లోనే వచ్చింది. ఏవో కారణాల వల్ల వాడు దాదాపు ఎనిమిదిసార్లు ఫెయిల్ అయ్యాడు. వాడి స్థానంలో నేనున్నా ఇంక ఆశని, ప్రయత్నాన్ని మానుకుని దొరికిన ఉద్యోగంలో చేరిపోదును. కానీ..వాడు పట్టుదల వదలలేదు. వాడి ఏజ్‌కి ఇది ఆఖరి అవకాశం. వస్తుంది అని నమ్మి ప్రయత్నించాడు. సాధించాడు. ఆరోజు బయటకెళ్ళినప్పుడు ఈ సంగతి చెప్పి 'ఫణీ, ఇప్పుడు నేనూ ఇండియన్ ఆర్మీలో సభ్యుడినిరా, ఈ దేశంలో పుట్టినందుకు ఈ మట్టి ఋణం తీర్చుకునే అదృష్టం ఇన్నాళ్ళకి నాకు దొరికింది' అన్నాడు. ఆ క్షణాన నాకు అర్థమయ్యింది. మనిషి స్వభావాన్ని, మట్టి మీద మమకారాన్ని ఏదీ మార్చలేదని. ఎవరో కొందరు స్వార్థపరుల మత మౌఢ్యం మారణహోమాన్ని సృష్టిస్తోందికానీ..ఈ దేశపు ప్రతి వ్యక్తి తనని తాను ఒక మతానికి ప్రతినిధిగాకన్నా భారతీయ ఆత్మకి ప్రతీకగా గుర్తింపబడడానికే ఇష్టపడతాని. అందుకే..ఇలా'' నవ్వాడు.

ఆప్యాయంగా కొడుకుని ప్రక్కన కూర్చోపెట్టుకుని ''ఫణీ! ఒక విషయం గమనించావా? ఏ దేశంలో ఎలా ఉన్నా కానీ..ఈ దేశంలోని ఇతర మతస్తుల జీవితంలో హిందుత్వ లక్షణాలు అంతర్లీనంగా ఉంటాయి.

భారతం భగవద్గీతల గురించి వారికి తెలుసు. శ్రీరాముడి గురించి శివుడి గురించి చెప్పగలరు. నువ్వు అన్న ఆర్థిక, సాంఘిక వెనకబడిన వర్గాల్లో మతం మార్చుకున్న వాళ్ళు కూడా దీపావళి, హోలీ లాంటి హిందూ పండగల్లో, జాతరలు, ఉత్సవాల్లో పాల్గొనకుండా మానడం లేదు. వీళ్ళేకాదు తరతరాల పరాయి మతస్థులు కూడా మన దేశపు సంస్కృతిని అలవరచుకుంటున్నారు. ఇప్పుడు చెప్పు ఈ దేశంలో హిందుత్వం నశిస్తుందంటావా?'' మృదువుగా అడిగాడు.

''ఊహూ, ఎప్పటికీ నశించదు'' దృఢంగా బదులిచ్చాడు ఫణి.

''హిందూ సంస్కృతి ఒక జీవనది. ఎన్ని పాయలుగా విడిపోయినా ఎన్నటికీ ఇంకిపోదు. ఈ ఒక్క నిజాన్ని ప్రతి భారతీయుడు గుర్తిస్తే చాలు ఉన్న మతాలే కాదు, మరెన్ని కొత్త మతాలొచ్చినా మహ్మద్ ఇక్బాల్ అన్నట్లు 'సదా రహేగా హిందూస్తాన్, హమారా, హమారా' అనే గీతం నిత్యం ప్రతి ఇండియన్ నోట సగర్వంగా వినదిస్తూనే ఉంటుంది'' కళ్ళు మూసుకొని ఆ గీతపు ఔన్నత్యాన్ని అనుభవిస్తూ పరవశంగా అన్నాడు మాధవశర్మ.




**ప్రతి ఇంటా తప్పనిసరిగా ఉండాల్సిన రిఫరెన్స్ బుక్స్ రెండు భాగాలు**

**1. వర్తమానంలో-మనం (మొదటి భాగం) వెల: రూ.20/-లు**

అద్దానికి మనవల్ల ప్రయోజనం లేదు. మనకు అద్దం యొక్క ప్రయోజనం ఉంది. మనం ఎలా ఉంటామో అద్దం మాత్రమే నిజం చెబుతుంది కాబట్టి. మనల్ని మన చుట్టూ ఉన్న సమాజాన్ని నిలువెత్తు అద్దంలో చూచుకున్నంత స్పష్టంగా వివరిస్తుంది ఈ పుస్తకం. ప్రతి ఒక్కరూ చదివితీరాల్సిన రిఫరెన్స్ బుక్ ఇది.

**2. మీ వ్యాధికి మీరే డాక్టర్ (రెండవ భాగం) వెల: రూ.30/-**

ప్రస్తుత సమాజంలో 80 శాతం పైగా ఎదుర్కొంటున్న ఎయిడ్స్, బి.పి., షుగర్, ఆస్మా, కీళ్లనొప్పులు, నపుంసకత్వం, మలబద్ధకం, అజీర్ణవ్యాధులు, పైల్సు, జుత్తు రాలిపోవడం (బట్టతల) జ్ఞాపకశక్తి లేకపోవడం, ఇంకా స్త్రీలకు సంబంధించిన అనేక రకాల సమస్యలకు కూడా చక్కని పరిష్కారం చూపెడుతుంది. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా వ్యాధి నయం చేయటంలో, మంచి ఫలితాలు ఇస్తున్నాయి. (ఇది ఏ వైద్య విధానానికి ప్రత్యామ్నాయం కాదు).

ఈ రెండు పుస్తకాలు మీ దగ్గరుంటే ఒక మంచి స్నేహితుడు, ఒక మంచి డాక్టర్ మీతో ఉన్నట్లే. తప్పక చదవండి. సంబంధిత ప్రాడక్ట్స్ అన్నీ కంపెనీ నిర్ణయించిన ధరలకే (ఎమ్.ఆర్.పి.) సప్లయి చేయబడును. రెండు పుస్తకాలు కలిపి రూ.50/-లకు, 5 సెట్లకు పైగా కొనుగోలు చేయువారికి పుస్తక విక్రేతలకు రెండు భాగాలు కలిపి (5 సెట్లు) రూ.200/-లకు కొరియర్‌లో పంపబడును. ఎమ్.ఒ./డి.డి. చేయవలసిన చిరునామా-

**కేమిశెట్టి శివలింగయ్య, శ్రీ సాయి మారుతీ నిలయం, డోర్ నెం.33-1-62, తిరువెంగళంపిళ్లై వీధి, ఒంగోలు-523 001, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఫోన్ నెం.08592- 235182.**

మనవి: ఎయిడ్స్ రహిత, రోగ రహిత సమాజంలో సగర్వంగా బ్రతకటానికి మీ వంతు సహకారం అందించండి. మెరుగైన సమాజం కోసం మీరు భాగస్వాములు కావాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం. డిపాజిట్ లేకుండా ఉపాధి అవకాశం. త్వరపడండి.

(CA: VJ/05-06-02172)